ప్రజాశక్తి
ఆదివారం 30 నవంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

బెర్రీ బోరర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:- కాఫీ పంటను నాశనం చేసేందుకు విస్తరించిన బెర్రీ బోరర్ వ్యాధి పురుగును నివారించేందుకు గాను స్థానిక మండల కాఫీ శాఖ ఆధ్వర్యంలో గసబ పంచాయతి సిపిఎం సర్పంచ్ అధ్యక్షతన గరిడేల గ్రామంలో గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాఫీ శాఖ ఉద్యానవనాధికారి ఎస్ మత్స్య రాజు మాట్లాడుతూ, కాఫీ బెర్రీ బోరర్ వ్యాధిని నివారించడానికి సేకరించిన కాఫీ పళ్ళను పల్పింగ్ చేసి, వేడి నీటిలో 2 నిమిషాలు ముంచాలన్నారు. అనంతరం బయటకు తీసి కాఫీ బెబీ పల్పర్‌లో పల్పింగ్ చేసి సిమెంట్ కల్లల్లో ఆరబెట్టి తేమ శాతం 10.5 ఉండేటట్లు చూసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం నుండి లైసెన్స్ పొందిన కోనుగోలుదారులకు మాత్రమే అమ్ముకోవాలని చెప్పారు. కాఫీ రైతులంతా సమిష్టిగా బెర్రి బోరర్ పురుగును నివారించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గసబ, గుంటసీమ కించుమండ, కంద్రుమ్ , పోతంగీ, కాఫీ లైజాన్ వర్కర్లు శివ, ధనుర్జయ్ , బోడన్న, స్వామి నాయుడు, గోపీనాథ్, స్థానిక వార్డు మెంబర్లు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

కాఫీ ఉత్పత్తులపై కార్యాచరణ ప్రణాళిక

-5న మెగా పేరెంట్ టీచర్ మీట్ - జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు: రాబోయే సంవత్సరం నుండి 5 సంవత్సరాల వరకు కాఫీ ఉత్పత్తులపై కార్యాచరణ ప్రణాళిక ప్రభుత్వం జీవో రూపంగా విడుదల చేసింద జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,మన ప్రాంతాల్లో పండిన అరుకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని, దానికి తగినట్లుగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. మన జిల్లాకు గాను కాఫీ ప్రాజెక్ట్ నిమిత్తం 202.19 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పాడేరు డివిజన్ 11 మండలాలో లక్ష ఎకరాల అదనపు కాఫీ తోటలు, 75 వేల ఎకరాలలో 30 సంవత్సరాలు దాటిన మొక్కలను తొలగించి, గ్యాప్ ఫీలింగ్ చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.విపత్తులు తట్టుకునే విధంగా తొమ్మిది రకాల నేటివ్ షేడ్ ప్లాంటేషన్ సిల్వర్ ఓక్ బదులుగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. మల్టీక్రాపింగ్ పద్ధతిలో ప్రయత్నం చేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరానికి గాను 1000 యూనిట్స్ మోటరైజ్డ్ బేబీ పల్పర్ యూనిట్స్ 85శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జీకే విధి, జీ మాడుగుల గ్రామాలలో ఎక్కువ పల్పర్ యూనిట్ మంజూరు అయ్యిందని, నిధుల మంజూరులో జాప్యం కారణంగా పనుల ఆలస్యం జరుగుతుందని అన్నారు. వచ్చే సంవత్సరం కాఫీ ఉత్పత్తి సమయానికి ఎక్కువ పల్పర్ యూనిట్స్ వాడకంలోకి వస్తుందని తెలిపారు. కాఫీ పండ్ల రకాలు బట్టి గ్రేట్ నిర్ధారిస్తామని, గ్రేడ్స్ నిర్ధారణ బట్టి రైతులకి గిట్టుబాటు ధర తెలియజేశారు. అరబికా కాఫీకి పార్చ్మెంట్ 450 రూపాయలు, చెర్రీ కాఫీ 270 రూపాయలు నిర్ధారించడం జరిగిందన్నారు. ఏ గ్రేడ్ కాఫీ పళ్ళకు కేజీ 60 రూపాయలు చొప్పున, బి గ్రేడ్ కాఫీ పళ్ళకు కేజీ 55 రూపాయలు చొప్పున నిర్ధారించామని తెలియజేశారు. కాఫీ బెర్రీ బోరర్ పాక్షికంగా ప్రభావిత ప్రాంతాలపై ఆంక్షలు విధించామని, ఆంక్షలు తప్పితే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. దీనిపై అవగాహన సదస్సులు పెట్టడం జరిగిందని తెలియజేశారు.

2025-2026 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 5న మెగా పేరెంట్ టీచర్ మీట్ జిల్లాలో అన్ని ప్రభుత్వ సంబంధిత ప్రైమరీ పాఠశాలు, సెకండరీ పాఠశాలలు, జూనియర్ కళాశాల లో పండగ వాతావరణంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి గాను జరిగిన ఫార్మేటివ్ అసెస్మెంట్, సమ్మేటివ్ అసెస్మెంట్

మాట్లాడుతున్న కలెక్టర్

లా పరీక్షల ఫలితాలు, పురోగతి పై తల్లిదండ్రులకు వివరించబడతాయని పేర్కొన్నారు. పాఠశాల, ఉపాధ్యాయులు పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రులకు తెలుపుతామన్నారు. జిల్లాలో 2945 ప్రభుత్వ పాఠశాలు, జూనియర్ కాలేజెస్‌లో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లపై ఎంఈఓస్, ఎటిడబ్ల్యూ ఎస్, ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 45 గంటలు వరకు, అనంతరం డొక్కా సీతమ్మ భోజన కార్యక్రమంతో ముగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ మెటీరియల్, స్పోర్ట్స్ మెటీరియల్, లైబ్రరీ బుక్స్ ప్రదర్శన చేస్తామన్నారు. జిల్లాలో 6300 ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మెగా పేరెంట్ టీచర్ మీట్లో ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులకు సన్మానం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ప్రతిభ, అనుమానాల నివృతి పై ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కలిసి క్లాస్ రూమ్ లో సమీక్షిస్తారని తెలిపారు. సెకండరీ విద్యార్థులకు తెలుపబడే కెరియర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి, మెంటల్ హెల్త్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై తల్లిదండ్రులకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పిఓ తిరుమని శ్రీ పూజ, జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీ, సమగ్ర శిక్షణ అధికారి స్వామినాయుడు పాల్గొన్నారు.

వారపు సంతలో క్రిస్మస్ సందడి

జోరుగా దుస్తుల అమ్మకాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంత ఈసారి క్రిస్మస్ పండగ వాతావరణాన్ని తలపించింది. క్రిస్మస్ పండగ సమీపిస్తున్న నేపథ్యంలో సంత మార్కెట్ కళకళలాడింది. గ్రామీణ ప్రజలు పెద్ద సంఖ్యలో సంతకు తరలివచ్చి వస్తువులను కొనుగోలు చేశారు. ప్రధానంగా క్రిస్మస్ పండగను దృష్టిలో ఉంచుకుని కొత్త దుస్తుల కొనుగోలు కోసం ప్రజలు వస్త్ర దుకాణాల వద్ద భారీగా గుమిగూడారు. దుస్తులకు మంచి గిరాకీ కనిపించింది. సంతలో కూరగాయలు, పండ్లు, కోళ్ల మాంసం, చేపలు, గృహోపకరణాలు వంటి అమ్మకాలు జోరుగా సాగాయి. క్రిస్మస్ అలంకరణలకు ఉపయోగించే స్టార్ లైట్లు, కాగితపు అలంకరణలు, బెలూన్లు ఎక్కువగా విక్రయమయ్యాయి.

రద్దీగా ఉన్న సంత

పాఠశాల భవనం మరమ్మతు చేపట్టాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

పాఠశాలను పరిశీలిస్తున్న గంగరాజు

ప్రజాశక్తి అనంతగిరి: మరమ్మతులకు గురై ప్రమాదంచులో ఉన్న కొత్తవలస బాలుర పాఠశాలకు నిధులు కేటాయించి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని సిపిఎం జెడ్పిటిసి దీసరి .గంగరాజు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు ఫోను ద్వారా ఫిర్యాదు చేశామని తెలిపారు. శనివారం పాఠశాలలో సందర్శించిన ఆయన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆయనతో మాట్లాడుతూ, పాఠశాల భవనం శిధిల వ్యవస్థకు చేరిందని, పైకప్పు రేకులు పాడవడమే కాకుండా తలుపు, కిటికీలు లేవన్నారు. దీంతో చల్లితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి హాస్టల్ వసతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ భవనం ఏర్పాటు చేసి సుమారు 37 సంవత్సరాల పైగా కావస్తుండడంతో శిథిలావస్థకు చేరి పైకప్పు రేకులు తుఫానుకు ఎగిరి పోయాయన్నారు. తలుపులు కిటికీలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఎప్పుడు ఏ గోడ కూలి పోతుందోనన్న భయంతో విద్యార్థులు గడుపుతున్నారని తెలిపారు. చాలీచాలని మరుగుదొడ్లు, స్నానపు గదులతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారని, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి అవసరమైన నిధులు కేటాయించి మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరారు. జిల్లా ఎస్ఎస్ఎ ఉన్నతాధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా నేటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో. మొస్య, పాఠశాల హెచ్ఎం కె.అప్పలస్వామి, డిప్యూటీ వార్డెన్ ధర్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తుపాన్‌పై రైతులు అప్రమత్తంగా ఉండాలి

మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్

ప్రజాశక్తి -హుకుంపేట: తుఫాన్ ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ శనివారం సూచించారు. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే కోసిన పంటను వెంటనే కుప్పలు వేసి భద్రపరచాలని సూచించారు. పొలాల్లో తెరిచి ఉంచితే వర్షాల కారణంగా ధాన్యం తడిసి నాణ్యత తగ్గడంతో పాటు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటల విషయంలో పరిస్థితిని బట్టి కోతను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. కోత పూర్తయిన పంటలపై తప్పనిసరిగా టార్పాలిన్లు కప్పి ఉంచాలని, తద్వారా వర్షపు నీరు పంటపై పడకుండా రక్షణ కలుగుతుందని తెలిపారు. అవసరమైతే ఉప్పు ద్రావణం పిచికారీ చేసి తేమ నుంచి పంటను కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు వంటి పంటలు తుఫాన్ ప్రభావంతో సంభవించే నష్టానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉందన్నారు. వర్షాలు, గాలులకు పంట కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున రైతులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.



టెన్త్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-కాశీపట్నం: అనంతగిరి మండలం జీనబాడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ (బాలికల)లో పదవ తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని పంచాయతీ టిడిపి అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి,గండి సురేష్,కె చంటి జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలో మారుమూల పినకోట, జీనబాడు పాఠశాలలో 150 పైబడి పదవ తరగతి విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రతి సంవత్సరం ఈ రెండు స్కూల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పదోవ తరగతి పరీక్షలకు సుమారు 100 కి.మీ దూరంలో ఉన్న శివలింగపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో పబ్లిక్ పరీక్షలు హాజరు అవుతున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో అక్కడున్న 15 రోజుల్లో వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థినిలు ఎక్కువగా అనేక ఇబ్బందులు పడుతున్నట్టు వారు తెలిపారు. సంబంధించిన అధికారులు జీనబాడు బాలికల పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపత్రాన్ని ఇసున్న నాయకులు

షాపులు తొలగించాలనడం సరికాదు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: స్వయం ఉపాధి కోసం మండల కేంద్రంలో గిరిజన నిరుద్యోగ యువత వేసుకున్న షాపులను అధికారులు తొలగించాలని చెప్పడం సరికాదని పోతంగి పంచాయతీ ఉపసర్పంచ్ ఎస్ జగ్గు నాయుడు హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి కోసం కేజీబీవీ పాఠశాల ఎదురుగా గిరిజన నిరుద్యోగ యువకుడు బతుకుతెరువు కోసం కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నారన్నారు. మండల అధికారులు ఆ దుకాణాన్ని అక్కడినుంచి తొలగించాలని చెప్పడం విచారకరమన్నారు. మండల కేంద్రంలో విచ్చలవిడిగా హైవే కిరువైపులా శాశ్వత షాపులను నిర్మించుకున్న వాటిని నిలుపుదలకు ఎటువంటి చర్యలు తీసుకోకుండా , బ్రతుకుతెరువు కోసం ఓ గిరిజన నిరుద్యోగి చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుంటే వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రంపచోడవరం : విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సిఐటియు కార్యాలయంలో గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ మాట్లాడుతూ కార్మికులకు తీపి కబురు అంటూ కేంద్ర ప్రభుత్వం ఈనెల 22వ నుంచి అమల్లోకి తెచ్చిన నాలుగు కార్మిక కోడ్లు లోగుట్టు అంతా శ్రామిక వ్యతిరేకతతోనే నిండి ఉందని పేర్కొన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కుల ప్రయోజనాలను తొలగించి ఈ కోడ్లను పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా రూపొందించడం దారుణమన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచడం ఎవరికి లాభమని ప్రశ్నించారు. కార్మికుల వేతనాలు పెంచకపోగా, పని గంటలు పెరిగిందంటే కార్మికుల వేతనాలు తగ్గిపోయినట్టేనని పేర్కొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్క అడుగు ముందుకేసి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా 13 గంటలు పని విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. సుప్రీం కోర్ట్ సమాన పనికి సమాన వేతనం, అంగన్వాడి, ఆశ వర్కర్లు, మధ్యాహ్నం భోజనం కార్మికులు, వెలుగు యానిమేటర్స్ లాంటి స్కీం వర్కర్లు కూడా కార్మికులుగా గుర్తించి అన్ని చట్టాలు వర్తిస్తాయని తీర్పులిచ్చినా పాలకవర్గాలు అమలు చేయడం లేదని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక లోకం అంతా ఏకమై విశాఖ నగరంలో జరిగే సీఐటీయూ18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి పాయం సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, పుట్ట రామరాజు, జిల్లా ఉపాధ్యక్షులు చింత రాంబాబు, పోడియం లక్ష్మణ్, కోర్రపు రాణి, కే.శాంతిరాజు, తీగల శ్రీనివాస్, జిల్లా నాయకులు కే.రామలక్ష్మి, కే.మంగమ్మ, వి.మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు, మహిళా కార్మికులు

ఎఒబిలో ముమ్మరంగా తనిఖీలు

మావోయిస్టుల బంద్ పిలుపుతో పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి -సీలేరు : మావోయిస్టు పార్టీ ఈనెల 30న భారత్ బంద్‌కి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా శనివారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. అణువణునా గాలింపు చర్యలు చేపట్టారు. సరిహద్దు గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలని మోహరించి మావోయిస్టుల ఆచూకీ కోసం విస్తృతంగా తనిఖీ నిర్వహిస్తున్నారు. శనివారం అధిక సంఖ్యలో పోలీసులు గ్రామాల్లో ఆపరేషన్ కొనసాగిస్తుండడంతో గిరిజన గ్రామాల్లో ప్రజలు భయాందోళన గురవుతున్నారు. కేంద్ర బలగాలు స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు అధిక సంఖ్యలో సరిహద్దుల్లో మోహరించి గాలింపు చర్యలు చేపడుతున్నారు. పోలీస్ ఔట్ పోస్టులుకు భద్రత కట్టు దిట్టం చేశారు. జీకే వీధి మండలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. దీంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో గిరిజనులలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయంతో వణుకుతున్నారు. జీకే వీధి మండలం సీలేరులో ఎస్సై యు. శీను ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. ప్రధాన కుడళ్ళలో సిఆర్పీఎఫ్ బలగాలని మోహరించి తనిఖీలు చేపట్టారు. సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

సీలేరులో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ యాసీన్, పోలీసు సిబ్బంది

ఆర్టీసీ బస్సులు రద్దు

అల్లూరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు పగటిపూట, నైట్ సర్వీసులు రద్దు చేస్తున్నట్లు విశాఖ డిపో మేనేజర్ మాధురి ప్రకటించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నారు.

రాజవొమ్మంగి : మావోయిస్టులు ఆదివారం బంద్‌కి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. రంపచోడవరం నియోజకవర్గం వ్యాప్తంగా పోలీస్ చెక్ పోస్టుల వద్ద విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. రాజకీయ పార్టీ నేతలకు లోతట్టు గ్రామాలకు వెళ్ళొద్దంటూ శనివారం నోటీసులు అందజేశారు. రాజవొమ్మంగి పోలీస్ సర్కిల్ పరిధిలో ఆరుగురు రాజకీయ నాయకులకు నోటీసులు ఇచ్చామని స్థానిక సీఐ గౌరి శంకర్ తెలిపారు.

నేడు బస్ సర్వీసులు నిలిపివేత

మావోయిస్టు బందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఏలేశ్వరం డిపో నుంచి ఆదివారం అడ్డతీగల, వై రామవరం, రాజవొమ్మంగి, నర్సీపట్నం, తాళ్లపాలెం, రేవళ్ళ వెళ్లే ఆర్టీసీ బస్ సర్వీసులను రద్దు చేశామని ఏలేశ్వరం డిపో మేనేజర్ సత్యనారాయణ శనివారం ఒప్రకటనలో తెలిపారు.

త్రో బాల్ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యా శాఖాధికారి ముత్యాలరావు రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పురుష ఉపాధ్యాయుల కోసం క్రికెట్ పోటీలు, మహిళ ఉపాధ్యాయుల కోసం త్రోబాల్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 60 మంది పురుష ఉపాధ్యాయులు, 30 మంది మహిళా ఉపాధ్యాయులు ఈ పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. ఉపాధ్యాయుల్లో మానసిక, శారీరక ఉత్సాహాన్ని పెంపొందించడంలో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరి దేవి, బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చినబాబు, మండల స్పోర్ట్స్ సమన్వయకర్త ఏ.కోటి, పీడీ సుదర్శన్, పీడీ వెంకట్, పిటి సితారత్న, పీడీ చందు, ఏ.నర్సయ్య, పీడీ చిన్నయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి-ఎటపాక : మండలంలోని గుండాల పంచాయతీ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ ప్రజలు సచివాలయం ఎదుట శనవారం ఆందోళన చేపట్టారు. గుండాల గ్రామపంచాయతీలో పలుచోట్ల వీధిలైట్లు వెలగడం లేదని, చీకట్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పొదలు పెరిగి రోడ్లపైకి చొచ్చుకొస్తున్నాయని, కాని పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. సమస్యల పరిష్కరించుకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు బుద్దుల భద్రయ్య, వార్డ్ మెంబర్ సుధాకర్, తోట శ్రీను, పెనుబల్లి భీష్మారావు, పసుపులేటి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన అనంతరం సచివాలయం అధికారికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

పోచవరం రేవు వద్దకు పెద్ద సంఖ్యలో ఉన్న పర్యాటకులు

పాపికొండల విహారానికి పెరిగిన రద్దీ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని పాపికొండల్లో బోట్లో విహరిస్తున్న యాత్రికులు పాపి కొండల విహారానికి పర్యాటకుల రద్దీ పెరిగింది. గోదావరిలో బోటు ప్రయాణాన్ని ఆస్వాదిస్తూ పర్యాటకులు ఎంతో ఆహ్లాదాన్ని అనుభవిస్తున్నారు. మండలంలోని పోచవరం గ్రామంలో యాత్రికులను బోటు యాజమాన్యం, ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ఎంతో సెక్యూర్టీతో పాపికొండలకు తీసుకెళతారు. తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దులు కలయికలో గోదావరి నదిలో విహార యాత్ర మరుపురాని మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతుంది. ఇక్కడే ఎత్తైన కొండల నుండి జాలువారే జలపాతాలు ప్రత్యేక ఆకర్షణ నిలుస్తున్నాయి. దీంతో పోచవరం రేవు ప్రాంగణం పర్యాటకులు సందడితో పండుగ వాతావరణం సంతరించుకుంది.

పోలవరం జిల్లా ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి -మారేడుమిల్లి : రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయడంపై ఆదివాసీ నాయకులు జి.బాబురావు హర్షం వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా కేంద్రం రంపచోడవరం, చింతూరు డివిజన్లకు దూరంగా ఉందని, మరింత సౌకర్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసిందని తెలిపారు. కొందరు కూటమి ప్రభుత్వాన్ని తప్పు పడుతున్నారని, అది సమంజసం కాదని, గుడ్డికన్నా మెల్ల మేలు అని పేర్కొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని కనపర్తి పంచాయతీ పరిధి కనపర్తి గ్రామంలో మండల ఇంజనీరింగ్ జెఇ రామకృష్ణ శనివారం పర్యటించారు. రూ.32 లక్షలతో నిర్మిస్తున్న జిపి బిల్డింగులను పరిశీలించారు. పనులు నాణ్యత, సక్రమంగా జరుగుతున్నాయా? లేదా? అన్నదానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జెఇ రామకృష్ణ

పంచాయతీ పాలకవర్గ సభ్యుల నిరసన

నిరసన చేపడుతున్న సభ్యులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకు వేలి మండలం పద్మాపురం మేజర్ పంచాయతీలో పంచాయతీ నిధుల జమలు, ఖర్చులు స్పష్టంగా చూపించని పంచాయతీ కార్యదర్శిపై తక్షణ చర్యలు తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పాలకవర్గ సభ్యులు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ అభివృద్ధి పనులను పక్కన పెట్టి, గత సాధారణ సమావేశంలో తీసుకున్న తీర్మానాలను అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వార్డు సభ్యుల తీర్మానాల అమలు గురించి అడిగితే, పంచాయతీలో నిధులు లేవు అంటూ తప్పుదారి పట్టించే సమాధానాలు ఇస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పాల వర్గ సభ్యులు ఆమోదం లేకుండానే పలు పనులకు అనుమతులు ఇచ్చి, పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు ఆరోపించారు. పంచాయతీలో లైట్ల పేరుతో భారీగా నిధులను ఖర్చుచేసినట్లు చూపించడం,బ్లీచింగ్ పేరుతో నిధులను దుర్వినియోగం చేయడం జరుగుతోందన్నారు.పంచాయతీ టెంట్ హౌస్‌ను కూడా పాలకవర్గం తీర్మానం లేకుండా కార్యదర్శి స్వయంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జె భగత్ రామ్, వార్డు సభ్యులు పాడి రవి, పుట్టంగి సింహాద్రి, కిల్లో మంగ్లీ, సమర్థి సుందరమ్మ, కిల్లో బోయిదే, బద్నాయి కొండమ్మ, పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రభుత్వ పాఠశాలలో దశల వారీగా నిర్వహిస్తున్న ఎస్సైన్మెంట్ ఎగ్జామ్ తో పాటు జి- ప్లాన్ వాటిపై పాఠశాలల సిబ్బంది అవగాహన కల్పించాలని విశాఖ భీమిలి డైట్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎల్ .సుదర్శన్ అన్నారు. శనివారం మండలంలోని ప్రిన్సిపల్ బృదంతో కలిసి మండల విద్యాశాఖ అధికారులు దాసరితోట, తీగలమాడ, శివలింగపురం.తో పాటు మండల కేంద్రంలో బాలికల పాఠశాల 2 లో సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 1 కిల్లో. బాలాజీ, సీఆర్పీలు రామకృష్ణ, సునీత గణేష్. పాల్గొన్నారు.


దొన్నుదొరకు వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

రోడ్డు మంజూరుకు వినతి

ప్రజాశక్తి-కాశీపట్నం:అనంతగిరి మండలం పరిధిలో గల కివర్ల పంచాయతీలో పలు సమస్యలపై ఏపీఎస్ఆర్టిసి విజయనగరం జోన్ చైర్మన్, అరకు నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ సివేరి దొన్ను దొరకు కివర్ల పంచాయతీ టీడీపీ తెలుగు రైతు అధ్యక్షులు కొండ తమాల లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కివర్ల పంచాయతీలో జాలాడ గ్రామంలో జలజీవన్ మిషన్ శాంక్షన్‌లో ఉన్నా నేటికీ నిర్మాణం చెయ్యలేదన్నారు. దీంతో కిలోమీటరు దూరం వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామన్నారు. నక్కులమామిడి గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలనీ, కివర్ల మెయిన్ రోడ్డు నుండి రాళ్ళగరవు వరకు రోడ్డు మంజూరు చేయాలన్నారు. వంతర్బ మెయిన్ రోడ్డు నుండి జంపపుట్టు నుండీ కన్నంగురువు వరకు రోడ్డు మంజూరు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో కివర్ల పంచాయతీ టీడీపీ తెలుగు రైతు అధ్యక్షులు కొండతామల లక్ష్మణ్‌రావు, మండల టీడీపీ యువజన నాయకులు కోట నాగేష్, పాంగి వెంకటరమణ, టీడీపీ సీనియర్ నాయకులు బాడం ఈశ్వరరావు పాల్గొన్నారు.

విస్తరాకుల తయారీ కేంద్రం పరిశీలన

విస్తరాకులను చూపుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ : మండలంలోని కిలోగుడ గ్రామంలో సంజీవని స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ సెంటర్‌ని శనివారం జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచివని, చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. చిరుధాన్యాలతో అనేక రకాల ఆహారాలు తయారు చేసి వాటిని ప్రజల్లోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు బీపీ, షుగర్ లాంటి వ్యాధులతో బాధపడుతున్నారని, బయట లభ్యమయ్యే ఆహార అలవాట్లకు బానిసలు కాకుండా చిరుధాన్యాలచే తయారు చేస్తున్న వంటకాలు అలవాటు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పర్యాటకులకు సాధారణ ఆహారం కాకుండా ఏజెన్సీ వంటకాలు రుచి చూపించాలని చెప్పారు.చిరుధాన్యాలచే తయారు చేస్తున్న పలహారశాలను కూడా ప్రారంభించారు.

అనంతరం కిలోగూడ గ్రామంలో మంజూరైన హెూమ్ స్టేస్ నీ పరిశీలించారు. అక్కడ నుంచి అనంతరం బల్యగూడ గ్రామంలో విడివికే సెంటర్ విస్తరాకుల తయారీ కేంద్రాన్ని పరిశీలించి లబ్ధిదారులకు, నిర్వాకులకు అభివృద్ధి పరంగా తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ వి ఎస్ నంద్, సంజీవని ఎన్జీవో సీఈవో దేవుళ్ళు, వాసన్ ఎన్జీవో సన్యాసిరావు, డిపిఎం ఏపీ సిఎన్ఎఫ్ భాస్కర్ రావు, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, తహసిల్దార్ త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు

హుకుంపేటలో ఉపాధ్యాయుల జట్టు

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ వంటి క్రీడలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, చిన్నారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ:- మండలంలోని ప్రభుత్వ పాఠశాలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ ఎంఈఓ 2 జి గిన్ను ఆధ్వర్యంలో శనివారం కిలో కూడా ఆశ్రమ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీల నిర్వహించగా మహిళా ఉపాధ్యాయులకు త్రోబల్ ఆటలు పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఎంఈఓ గన్ను మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పుడు విధి నిర్వహణ బాధ్యతలోనే ఉంటున్నారని అటువంటి ఉపాధ్యాయులకు ఇటువంటి క్రీడ పోటీలు నిర్వహించడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఉపశమనం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు, ఎం శ్రీను, ఎస్ రాజు, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మండల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి పి బ్రహ్మాజీ రావు, మండల విద్యాశాఖాధికారి ఎం.జాన్ శనివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ, ఈ క్రీడలతో మానసిక ఆరోగ్యం, మనోవికాసం కలుగుతుందని తెలిపారు.

దుంబ్రిగుడలో పోటీలను ప్రారభిస్తున్న ఎంఇఒ

ఇవిఎంలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- పాడేరు: స్థానిక డిగ్రీ కళాశాలలో గల రూమ్‌లో భద్రపరిచి ఉన్న ఈవీఎంలను వివిధ ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా శనివారం ఉదయం ఈవీఎం గోదాములను సందర్శించారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఆర్ డిఓ, డిప్యూటీ కలెక్టర్, ఏంవిఎస్ లోకేశ్వరరావు, ఇంచార్జి డిఆర్ఓ అంబేద్కర్, టిడిపి ప్రతినిధి కె. రాజేష్, బిజెపి ప్రతినిధి కె ఆర్ రావు, వైఎస్ఆర్ సిపి ప్రతినిధి జి.వేణుబాబు, స్థానిక రెవెన్యూ అధికారులు, ఎలక్షన్ సూపరిండెండెంట్ లక్ష్మణ రావు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో..
ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-యంత్రాంగం

కొమ్మాది : మధురవాడ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు పిఎం.పాలెం ఆర్‌హెచ్.కాలనీకి చెందిన గొంప జశ్వంత్ (20)గా పోలీసులు గుర్తించారు. శుక్రవారం అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో జశ్వంత్ విశాఖ నుంచి పిఎం.పాలెంవైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అపస్మారక స్థితిలో ఉన్న జశ్వంత్‌ను స్థానికులు కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని తండ్రి దేవుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ నేతృత్వంలో ఎస్ఐ జె.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నక్కపల్లి: మండలంలో వేంపాడు జంక్షన్ వద్ద శనివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.శ్రీకాకుళం జిల్లా పలాస కు చెందిన షేక్ తాజుద్దీన్ (36) బైక్ పై వస్తూ వేంపాడు హైవే జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో తుని నుండి నక్కపల్లి వస్తున్న లారీ ఢీకొనడంతో షేక్ తాజుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు.

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కె.నగరపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి ఈ నెల 28వ తేదీ సాయంత్రం ఇంట్లోని బెడ్ రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం... నగరంలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న కురందాసు చిన్మయానంద ఈ నెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు.

గిరిజనులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి తులసి

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -అనంతగిరి:మలేరియా వ్యాధి పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా పని చేయాలని అల్లూరి జిల్లా మలేరియా అధికారిణి తులసి అన్నారు. మండలంలోని భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుడిగాలి పర్యటించారు. ముందుగా ఆసుపత్రుని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. భీమవరం ఆస్పత్రి అంటేనే మలేరియా జోన్ లాంటిదని ఆ నేపథ్యంలో ల్యాబ్ టెక్నీషియన్ రోగులకు రక్తపూతల సేకరించి వ్యాధి నిర్ధారణ చేయవలసిన అవసరం ఉందని సూచించారు. మలేరియా పాజిటివ్ గా ఉన్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం గొట్టలపాడు గ్రామంలో సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భీంపోలు బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థిలకు దోమతెరలు క్రమం తప్పకుండా వినియోగించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్వైజర్ దాలన్నదొర, . మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ జి.రామచంద్ర పాల్గొన్నారు .

నాగరాజుకు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

రైతులు నాగరాజును ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : ప్రకృతి వ్యవసాయం చేస్తూ అరటి పంటలో అధిక దిగుబడి సాధించిన మండలంలోని కింద్ర కాలనీ గ్రామానికి చెందిన గంప నాగరాజును రైతులు ఆదర్శంగా తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి దేవాదానం అన్నారు. అఖిలభారత పండ్ల తోటల సమన్వయ పథకం, ట్రైబల్ సబ్ ప్లాన్ పథకం ద్వారా శనివారం రంపచోడవరం నియోజకవర్గం, గంగవరం మండలం, రాజంపాలెం గ్రామంలో టిష్యూ కల్చర్, అరటి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం కొవ్వూరు పరిశోధన సహసంచాలకులు డాక్టర్ డి.వెంకటస్వామి పండ్ల తోటల సమన్వయ పథకం గూర్చి ట్రైబల్ సబ్ ప్లాన్ గూర్చి తెలియజేశారు. అనంతరం ఎంపిక చేయబడిన రైతులకు ఎకరానికి 1250 టిష్యూ కల్చర్ అరటి మొక్కలను ఎరువులను జీవ రసాయనాలను, ఆర్క బనానా స్పెషల్, ప్లాస్టిక్ క్రేట్లను పంపిణీ చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఈ కార్యక్రమంలో భాగంగా అరటి మొక్కలను తీసుకొని సాగు చేసి అధిక లాభాలను పొందిన ఇద్దరు రైతులు గంగవరం మండలానికి చెందిన రైతు బాబ్జి, రాజవొమ్మంగి మండలం కింద్ర కాలనీకి చెందిన గంపా నాగరాజు తమ అనుభవాలను తెలిపారు. అనంతరం వారికి జ్ఞాపికలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం కొవ్వూరు నుండి డాక్టర్ ఏ స్నేహలత రాణి, సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ల విభాగం) వి శివకుమార్, ఉద్యాన విభాగం మల్లు దొర, ఏఈఓ దామోదర్, స్వర్ణలత, ఎంపీఈవో, ఐటీడీఏ, విహెచ్ఎ విఏఏ, నియోజకవర్గంలోని పలు మండలాల రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-చింతూరు : ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎమ్. శేఖర్ అన్నారు. శనివారం కళాశాలలో వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా రెడ్ రిబ్బన్ క్లబ్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పోస్టర్ ప్రజెంటేషన్, రంగోలి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ పై అవగాహన పెంపొందించడం, అపోహలను తొలగించడం, బాధితులకు సామాజిక మద్దతు తెలపడం లక్ష్యంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో పోస్టర్ ప్రజెంటేషన్, ముగ్గుల పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ ఎమ్.నాగ మోహన్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.సాయికుమార్, జి.వెంకటరావు, జి. హారతి, బి. శ్రీనివాసరావు, ఆర్. మౌనిక, ఎన్. ఆనంద్, కె.లక్ష్మి ప్రసన్న కుమారి, ఆర్.కిరణ్మయి, కె.కీర్తి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా లాడియ జ్యూయలరీ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ద్వారకా నగర్‌లో లాడియ డైమండ్ జ్యూయలరీ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీనటి సంయుక్త మీనన్‌తో కలిసి లాడియ జ్యూయలరీ డైరెక్టర్ అఖిల్ వేములూరి రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఫ్రీ లాంచ్ ఈవెంట్‌లో సంయుక్త మీనన్ ఫొటోలకు పోజులిచ్చి సందడి చేశారు. అనంతరం అఖిల్ వేములూరి మీడియాతో మాట్లాడుతూ భారతదేశం వజ్రాల ల్యాబ్ - గ్రోన్ వజ్రాల రంగంలో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. ఈ రంగంలో వినూత్న ఆలోచనలతో విభిన్న ఆవిష్కరణలకు లాడియ కట్టుబడి ఉందన్నారు. సహజ వనరుల నివారణ, హానికరమైన మైనింగ్ పద్ధతులను తగ్గించడం ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ ప్రత్యేకత అని తెలిపారు. లాడియ ల్యాబ్‌లో రూపుదిద్దుకునే వజ్రాభరణాలు కచ్చితమైన నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయబడతాయని చెప్పారు. ఇక్కడ నెక్లెస్లు, బ్యాంగిల్స్, పెండెంట్లు, కంకణాలు, చెవిపోగులు, ఝుమ్కాస్, ఉంగరాలు ప్రత్యేకమైన ల్యాబ్‌లో పోల్కిస్, కస్టమైజేషన్- మేక్ యూరోన్ డిజైన్లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఫెర్రీ బకాయిలపై నిర్లక్ష్యం దేనికి?

ప్రజాశక్తి-కూనవరం : ఫెర్రీ బకాయిల వసూలు విషయంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం దేనికని సిపిఎం పట్టణ కార్యదర్శి కొండ ఈశ్వర్లు ప్రశ్నించారు. సిపిఎం పట్టణ కమిటీ సమావేశం గడ్డిపాటి షణ్ముఖరావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వర్లు మాట్లాడుతూ గడిచిన 8 నెలల కాలంగా పాటదారుని దగ్గర నుండి రావలసిన బకాయి సొమ్మును వసూలు చేయడంలో ఎందుకు మీనమేసాలు లెక్కిస్తున్నారని, వెంటనే వసూలు చేయాలని డిమాండ్ చేసారు. పడవ ప్రయాణికుల ఛార్జిని రూ.40 నిర్ణయించారని, కాని పాటదారులు ఒక మనిషికి రూ.100 వసూలు చేయడం దారుణమన్నారు. దీనిపై పంచాయతీ సెక్రెటరీని ప్రశ్నిస్తే తనకు ఎటువంటి సంబంధం లేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు పంచాయతీ డబ్బుకు సంబంధించి ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని, పెర్రీదారులు ప్రయాణికుల నుండి వసూలు చేస్తున్న అధిక ధరలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేకుంటే అన్ని గ్రామాల ప్రజలతో కూనవరం ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు తాళ్లూరు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, తాళ్లూరి రామారావు, కొండా నాగమణి, బొజ్జ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో ఆ ప్రభావం అల్లూరి జిల్లాపై ఉండే అవకాశం ఉందని, రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని అగ్రికల్చర్ అధికారి చక్రధర్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. భారీ గాలులు, వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం, సోమవారం రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

చింతూరు : దిత్వా తుఫాను నేపథ్యంలో వరి రైతులు డిసెంబర్ 1వ తేదీ వరకు వరి కోతలు నిలిపివేయాలని కుప్పలు వేసిన వాటికి పదాలు కప్పి తడవకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదివాసీల హక్కులపై దాడి అన్యాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్ల ఆదివాసీలు తమ హక్కులను కోల్పోతున్నారని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు అన్నారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశం శనివారం రంపచోడవరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న ఆదివాసి వ్యతిరేక విధానాలపై డిసెంబర్ 1న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆదివాసులపై జరుగుతున్న దాడులు, రంపచోడవరం జిల్లాకి పేరు పెట్టటం, ఆదివాసి చట్టాలు అమలు తీరుపై ఆదివాసులకు జరుగుతున్న అన్యాయాలపై చర్చించి భవిష్యత్తు కార్య చరణ తీసుకోబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, మడకం రామకృష్ణ దొర, గణేష్ దొర తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు పటిష్ట చర్యలు : సిపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శనివారం నగరంలో ఉన్నత స్థాయి నెలవారీ సమీక్షా సమావేశాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎడిసిపిల స్థాయి నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల వరకూ జరిగిన ఈ సమావేశంలో ప్రతి పోలీస్ స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా తెలుసుకున్నారు. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రౌడీ షీటర్లు, ఎన్‌డిపిఎస్ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డిపిఎస్) కేసులను సమీక్షించి నగరం గుండా ఎట్టి పరిస్థితుల్లో వాటి రవాణా జరగకుండా చూడాలన్నారు. గంజాయి వినియోగం, అమ్మకాలను పూర్తిగా అదుపు చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారం, కన్విక్షన్ రేటు పెంపుపై దృష్టి సారించాలన్నారు. మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడానికి, నిర్మానుష్య ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలలో విజిబుల్ పోలీసింగ్, పికెట్, డెకాయ్ టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారదర్శకత, బాధ్యతాయుతమైన విధులు మంచి పేరు తెచ్చిపెడతాయన్నారు.

పెరుగుతున్న చలి

ప్రజాశక్తి-విఆర్.పురం : ఏజెన్సీలో క్రమేపి చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం గ్రామాల్లో పొగ మంచు కురుస్తుంది. ఫలితంగా పిల్లలు, పెద్దలు, వృద్ధులు చలికి తట్టుకోలేకపోతున్న పరిస్థితి ఉంది. చలికాలం ప్రారంభంలోనే చలి ఇంత తీవ్రంగా ఉంటే వచ్చే రెండు నెలల పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీలో ఇప్పుడే మంచు దుప్పటి కప్పినట్లు పొగమంచు కురుస్తోంది. ఇక్కడ దట్టమైన అడవులు పక్కనే చల్లగా వీచే గోదావరి గాలులతో గోదావరి పరివాహక గ్రామాల్లో సాయంత్రం 5 గంటలు నుండి చలి తీవ్రంగా ఉంటుంది.

నేడు గురజాడ వర్ధంతి సభ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు జాతి గర్వించదగ్గ యుగకర్త, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతి సభ ఈ నెల 30న మధ్యాహ్నం 3.30 గంటలకు గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ సమీపానగల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరుగనుంది. ఈ మేరకు వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమాజాన్ని మేల్కొలిపిన గురజాడ ఆశయాలను, ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లటానికి గురజాడ సాంస్కృతిక వేదిక కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో పర్యటిస్తున్న మురళీ గంగాధరరావు

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : మండల న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, రంపచోడవరం జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ యం.మురళి గంగాధరరావు ఆధ్వర్యంలో నల్లగొండ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల అనర్థాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ విలువలు, గొప్పతనం, ప్రాథమిక విధులు, బాలికలకు బాల్య వివాహ చట్టలపైనా, బాల కార్మిక చట్టాలు, పోక్సో చట్టం, గుడ్ టచ్ బాడ్ టచ్, ట్రైబల్ చట్టాలు వంటివాటిపై అవగాహన కల్పించారు. జడ్జి మురళి గంగాధరరావు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యం, చదువు పైన శ్రద్ధ వహించాలని సూచించారు. బాలికలకు తగిన సదుపాయాలులేవని, కనీస అవసరాలైన టాయిలెట్స్, క్లాస్ రూమ్, హాస్టల్ గదులు, భోజనశాల, పాఠశాల బిల్డింగ్ కండిషన్ అస్సలు బాలేదని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి.వీరబాబు, చుక్క సంతోష్ కుమార్, ధర్ముల లక్ష్మి నారాయణ, కోర్ట్ సూపరింటెండెంట్ నాగభూషణం, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'రైతన్నా మీ కోసం'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రైతు శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గణజాల తాతారావ్ అన్నారు. శనివారం మండలంలోని మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడు, కోసూరివారివీధి గ్రామాల్లో రైతన్నా మీకోసం అన్నదాత సుఖీభవ-వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేకూరేవిధంగా పెట్టుబడికి ఉపయోగపడేలా 67లక్షల మంది రైతులకు 3135కోట్లు రెండవ విడత అన్నదాత సుఖీభవ నిధుల విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగుయువత అధ్యక్షుడు బారంగి అనుదీప్, బూత్ కన్వీనర్ కొచ్చా కాసులమ్మ, సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్ రవితేజ, ప్రకృతి వ్యవసాయ సలహా సిబ్బంది బూరా రత్నరాజు, బోడోజు నరసయ్య, రైతులు పాల్గొన్నారు.

బూదరాళ్ల పంచాయతీ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మారుమూల బూదరాళ్ల పంచాయితీ పరిధిలో వివిధ గ్రామాల్లోని సమస్యలను పాడేరులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఐదు గ్రామాల గిరిజనులతో కలిసి సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డ్ నెంబర్ సంజీవులు కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. పంచాయితీ పరిధిలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు నూతన భవనాలు మంజూరు చేయాలనీ, రోడ్లు లేని గ్రామాలకు తారురోడ్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లబెల్లి, బి.కొత్తవీధి, బి.సింగవరం, చీడిపల్లి, సూదులపాడు తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సరిపడా సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : ఇటీవల జరిగిన బదిలీల్లో మండలం నుంచి ఎక్కువ మంది సిబ్బంది బదిలీపై వెళ్లారని, కానీ మండలానికి తక్కువ మంది వచ్చారని, దీంతో ప్రజలకు సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సరిపడా సిబ్బందిని నియమించాలని ఎంపిపి బడుగు రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. గిరిజన సంక్షేమ హాస్టల్లో జరిగిన విద్యార్థుల అస్వస్థతపై మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే అది జరిగిందని, ఇకనుండి అలా జరగకుండా చూడాలని ఏటిడబ్ల్యూఓ క్రాంతికుమార్‌ను, ఎంఈఓ రాంబాబును కోరారు. అనంతరం సిడిపిఓ మొంథా తుఫాన్‌లో దెబ్బతిన్న బిల్డగ్ వివరాలను పై అధికారులకు పంపించమన్నారు. గ్రామాలలో సారా బెల్ట్ షాపు ఎక్కువగా నడుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. రోడ్ల పైన విచ్చలవిడిగా పశువుల్ని వదిలేయటం మంచిది కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.